ఆంధ్రజ్యోతి

5 ANDHRAJYOTHY

అనకాపల్లి జిల్లా వార్తలు

ఆదివారం 3 మార్చి 2024



టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లు

- జగన్ పాలనలో దళితులపై పెరిగిన దాడులు
- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు
- ఎస్సీ కాలనీలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



- వార్త 7వ పేజీలో..

వల్లంపేటలో ఉద్రిక్తత

రూ.2 కోట్ల విలువైన స్థలం ఆక్రమణపై వివాదం

- వైసీపీకి చెందిన ఇరువర్గాల కొట్లాట
- స్థలం చుట్టూ కంచె వేసిన మాజీ సర్పంచ్ వర్గీయుడు
- కంచెను కొంత మేర తొలగించిన సర్పంచ్, ఆమె భర్త
- సర్పంచ్ భర్త, మాజీ సర్పంచ్ మధ్య ఘర్షణతో పోలీసుల రంగ ప్రవేశం



ఇరువర్గాలను అడ్డుకుంటున్న ఎస్ఐ రామారావు

నాతవరం, మార్చి 2: **మండలంలోని వల్లంపేటలో శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వ స్థలం ఆక్రమణ విషయంలో అధికార వైసీపీకి చెందిన ఇరువర్గాలు కొట్లాటకు దిగాయి. పరిస్థితి అదుపుతప్పుతుండడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.**

నాతవరం మండలం వల్లంపేట పంచాయతీ సర్వే నంబరు 180లో రూ.2 కోట్లు విలువైన 32 సెంట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణ విషయమై వివాదం తలెత్తింది. మాజీ సర్పంచ్ సుర్ల యోగి వర్గీయుడు మూడు రోజుల క్రితం ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారని, దీని వల్ల ఆ స్థలం మీదుగా పొలాలకు వెళ్లే సుమారు 150 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ ఇటంశెట్టి శ్యామల తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమె శనివారం తన భర్త శ్రీనివాస్‌తో కలిసి ఆ స్థలం వద్దకు వెళ్లి ఫెన్సింగ్‌ను కొంత మేర తొలగించారు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న మాజీ సర్పంచ్ సుర్ల యోగి, అతని వర్గీయులు వారిని అడ్డుకున్నారు. సర్పంచ్ భర్త శ్రీనివాస్, మాజీ సర్పంచ్ యోగి మధ్య తోపులాట జరిగింది. దీంతో వారిరువురికి చెందిన అనుచరులు ఘర్షణ పడ్డారు.



ప్రభుత్వ స్థలంలో ఫెన్సింగ్ వేసిన దృశ్యం

వాతావరణం ఉద్రిక్తంగా మారడంతో నాతవరం ఎస్ఐ రామారావు రంగంలోకి దిగి వారిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో నర్సీపట్నం సీఐ బి.హరికి పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన నర్సీపట్నం రూరల్ ఎస్ఐ భీమరాజు, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గుమిగూడిన ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ యోగి మాట్లాడుతూ ఈ స్థలంలో ఇరవై ఏళ్లుగా వియ్యపు గణేశ్ నివాసముంటున్నాడని, అందుకే స్థలం చుట్టూ కంచె వేసుకున్నా డన్నారు. సర్పంచ్ శ్యామల మాట్లాడుతూ ఈ స్థలం ఆక్రమణకు గురైందని, ఆక్రమణలను తొలగించి రైతు భరోసా కేంద్రానికి కేటాయించడం లేదా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గతంలో కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. సంఘటన స్థలానికి చేరుకున్న తహసీల్దార్ రమేశ్‌కుమార్ ఈ స్థలం ఎవరిదని వీఆర్వో మూర్తిని అడిగారు. ఇది ప్రభుత్వ స్థలమని వీఆర్వో తెలపగా, ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. అయితే వల్లంపేటలో మరో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు ఉన్నాయని, వాటిని కూడా తొలగించాలని మాజీ సర్పంచ్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలాంటి గొడవలు వద్దని సూచించారు. సర్వే నంబరు 180లో 32 సెంట్ల భూమి వివరాల రికార్డులను వెంటనే తనకు అందించాలని వీఆర్వో మూర్తిని ఆదేశించారు. ఇరు వర్గాలతో నాతవరం ఎస్ఐ రామారావు కొంతసేపు చర్చించారు. శాంతి భద్రతలకు ఇబ్బంది కలిగితే ఇరువర్గాలపై కేసులు పెడతామని హెచ్చరించారు.

5, 7 తేదీల్లో సీఎం రాక

5న విశాఖలో పారిశ్రామిక సదస్సు

- 7న అనకాపల్లిలో 'చేయూత' కార్యక్రమం



విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల ఐదు, ఏడు తేదీల్లో విశాఖ రానున్నారు. ఈనెల ఐదో తేదీన 'విజన్ వైజాగ్' పేరుతో భీమిలి బీచ్‌రోడ్డులోని రాడిసన్ హోటల్‌లో పారిశ్రామికవేత్తలతో నిర్వహించనున్న సదస్సులో ఆయన పాల్గొంటారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన శాఖ పీఎం పాలెంలోని వి.కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న కార్యక్రమానికి సీఎం హాజరవుతారు. అలాగే ఈనెల ఏడో తేదీన మరోమారు సీఎం విశాఖ రానున్నారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకుని, విమానాశ్రయం నుంచి నేరుగా అనకాపల్లి వెళతారు. 'చేయూత' పథకం నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. ఈనెల ఐదో తేదీన విశాఖలో సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్ అయ్యన్నార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత వర్మ, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు శనివారం పరిశీలించారు.

ఐఐపీఈ శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన

- పాట్నా నుంచి వర్చువల్‌గా కార్యక్రమం...

... వివరాలు మెయిన్‌లో

ఇంకా అసంపూర్తిగానే..

ప్రాధాన్యతా భవనాలు ఎప్పటికి పూర్తయ్యేనో?

- పలు చోట్ల నిలిచిన సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు
- అందుబాటులోకి వచ్చినవి స్వల్పం
- కొన్ని చోట్ల పురోగతి శూన్యం



తూటిపాలలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

మాకవరపాలెం, మార్చి 2: **వైసీపీ ప్రభుత్వం ప్రాధాన్యతా భవనాలుగా చెప్పుకుంటున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు మండలంలో పురోగతి లేకుండా ఉన్నాయి. కొన్ని చోట్ల అసంపూర్తిగా, మరికొన్ని చోట్ల పునాదుల స్థాయిలో దర్శనమిస్తున్నాయి. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది.**

మండలంలో 13 సచివాలయ భవనాలు, 14 రైతు భరోసా కేంద్రాలు, 13 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు భవనాలను రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం మంజూరు చేసింది. వాస్తవానికి 14 సచివాలయ భవనాలకు గాను ఒకటి పాత భవనంలోనే కొనసాగగా, 13 భవనాల నిర్మాణం ప్రారంభించారు. తామరం, జి.కోడూరు, కొండలఅగ్రహరం, గిడుతూరు, వజ్రగడ, పాపయ్యపాలెం గ్రామాల్లో సచివాలయ భవనాలు పూర్తయి అందు బాటులోకి వచ్చాయి. శెట్టిపాలెం, జాగలపల్లి గ్రామాల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. పీపీఅగ్రహారం, బూరుగుపాలెం,



తూటిపాలలో శ్లాబ్ దశలో ఉన్న రైతు భరోసా కేంద్రం

తూటిపాల గ్రామాల్లో శ్లాబ్‌లు వేసి వదిలేశారు. మాకవరపాలెం, రాచపల్లి గ్రామాల్లో పనులు చివరి దశలో నత్తనడకన సాగుతున్నాయి. అలాగే 14 రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) మంజూరుకాగా తామరం, జి.కోడూరు, పాపయ్యపాలెం, వజ్రగడ, పైడిపాల గ్రామాల్లో భవనాలు అందుబాటులోకి వచ్చాయి. మాకవరపాలెం, గిడుతూరు, తూటిపాల, బూరుగుపాలెం, లచ్చన్నపాలెం, పీపీ అగ్రహా



పాపయ్యపాలెంలో పునాదుల స్థాయిలో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

రం, జి.వెంకటాపురం గ్రామాల్లో శ్లాబ్ వేసి వదిలేశారు. మిగిలిన గ్రామాల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల విషయానికి వస్తే తామరం, జి.కోడూరు, భీమబోయినపాలెం, వజ్రగడ గ్రామాల్లో కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. తూటిపాల, లచ్చన్నపాలెం, కొండలఅగ్రహారం, పీపీఅగ్రహారం గ్రామాల్లో శ్లాబ్‌ల స్థాయిలోనే ఉన్నాయి. పాపయ్యపాలెం, గిడుతూరు గ్రామాల్లో పిల్లర్ల దశలోనే పనులను నిలిపివేశారు. దీంతో ఆయా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా భవన నిర్మాణాలను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

పీలా గోవిందను కలిసిన కొణతాల

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయం

- అధిష్ఠానం ఆదేశాల మేరకే నిర్ణయం తీసుకుంటా..
- మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద



మాజీ ఎమ్మెల్యే పీలాతో భేటీ అయిన కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, మార్చి 2: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడమే తన ధ్యేయమని, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఏ నిర్ణయమైనా తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. శనివారం టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పీలాను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు అంశాలపై వారు మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగిన అరాచకాలకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో నడుం బిగించి కార్యకర్తలంతా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. అధికార పార్టీ నాయకుల వేధింపులకు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు గురయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కార్యకర్తలకు అండగా ఉండేందుకు సిద్ధమన్నారు. కార్యకర్తల మనోభావాలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల ఐదో తేదీన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో భేటీ ఉందని, శుభపరిణామాలు చోటుచేసుకోనున్నాయని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా కేటాయించిన సీట్లు మార్పు చేసే అవకాశం కూడా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని, పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు. పార్టీల అధిష్ఠానాల నిర్ణయం మేరకు ముందుకు సాగుదామని కొణతాల రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టి జంక్షన్ వ్యూ పాయింట్ మునిగిపోయిన దృశ్యం



అలల తాకిడికి ఫ్లోటింగ్ బ్రిడ్జి తలకిందులు

మళ్లీ ఊడిన 'టి జంక్షన్ వ్యూ పాయింట్'

- అక్కడే కొనసాగించాలని అధికారుల మొండి పట్టుదల!
- పర్యాటకులకు ఏమైనా అయితే బాధ్యత ఎవరిది?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) **ఆర్‌కే బీచ్‌లో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జిపై అధికారులు మొండి పట్టుదలకు పోతున్నారు. బలమైన కెరటాల ధాటికి ఆ వంతెనకు అమర్చిన 'టి జంక్షన్ వ్యూ పాయింట్' ప్రతి రోజూ తలకిందులు అవుతోంది. బ్రిడ్జి నుంచి విడిపోయి దూరంగా వెళ్లిపోతోంది.**

ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఏ ముహూర్తాన ప్రారంభించారో గానీ దానిపైకి ఎవరినైనా అనుమతించాలంటేనే ఈతగాళ్లే భయపడుతున్నారు. ముంబై నుంచి వచ్చిన నిపుణుల బృందం కూడా సరైన సూచనలు చేయలేకపోయింది. శనివారం ఉదయం మరోసారి అలల వంతెన తిరగబడడంతో ఆ ప్రాంతం అంతా కల్లోలంగా మారిపోయింది. అలలు వచ్చినప్పుడు 'టి జంక్షన్ వ్యూ పాయింట్' బాగా పైకి ఎగిసిపడుతోంది. ఆ సమయంలో పొరపాటున అక్కడ ఎవరైనా ఉంటే ప్రమాదమే. ఆర్‌కే బీచ్‌లో ఎక్కడికక్కడే పదునైన బండరాళ్లు ఉన్నాయి. అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంలో ఈ ప్రాజెక్టును పెట్టి, దానిని ఎలాగోలా నడపాలని చూడడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. తప్పును సవరించుకుని సురక్షితమైన మరోచోట పెట్టుకోవచ్చు. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. ఇంకొక దగ్గరకు మార్చాలంటే అనుమతులు అవసరమవుతాయని, దానికి జాప్యం జరుగుతుందని ఆలోచన చేస్తున్నారు.



బ్రిడ్జి నుంచి విడివడి దూరంగా ఉన్న టీ జంక్షన్ వ్యూపాయింట్

ఆర్కే బీచ్ వద్ద సముద్రం ప్రశాంతంగా ఉండడం చాలా అరుదు. అలలు తీరాన్ని ఢీకొడుతూనే ఉంటాయి. అక్కడే ఫ్లోటింగ్ బ్రిడ్జిని కొనసాగించాలనే ప్రయత్నం కంటే..సురక్షితమైన ప్రాంతంలో నిర్వహించడం ఎంతో మేలు. ఈ ప్రాజెక్టు కారణంగా పర్యాటకులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారు. ఇవీమీ అధికారులకు అర్థం కావడం లేదు.

నేడు పల్స్ పోలియో

- జిల్లా వ్యాప్తంగా 1,409 శిబిరాల ఏర్పాటు
- సోమ, మంగళవారాల్లో ఇంటింటా కార్యక్రమం

అనకాపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు. 0-5 ఏళ్లలోపు వయసు గల 1,92,120 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలో 1,409 శిబిరాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. 45 పీహెచ్‌సీల పరిధిలో 90 మొబైల్ బృం దాలను ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొననున్నారు. పల్స్ పోలియో శిబిరాల పర్యవేక్షణకు 10 మంది వైద్యులను నియమించారు. జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్స్‌లోనూ పల్స్ పోలియో శిబిరాలను ఏర్పాటు చేశారు.

ఇంటింటా పల్స్ పోలియో కార్యక్రమం

జిల్లాలో ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంతో సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు ఇంటింటికీ సిబ్బంది వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు చుక్కలు వేస్తారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హేమంత్ తెలిపారు. గతంలో పోలియో టీకాలు తీసుకున్నా మళ్లీ వేయించుకో వాలన్నారు.

7న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, మార్చి 2: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 7వ తేదీన నిర్వహించనున్నట్టు సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరం వీసీ హాల్‌లో ఒకటి నుంచి ఏడో స్థాయి సంఘ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘ సమావేశాలు, 11 గంటలకు 3, 4 స్థాయీ సంఘ సమావేశాలు, 12 గంటలకు 1, 6, 7 స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తామని, జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

అనకాపల్లి టౌన్, మార్చి 2: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షకు 12,276 మంది హాజరుకావాల్సి ఉండగా 11,979 మంది హాజరయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు రీజనల్ అధికారి సుజాత తెలిపారు. 297 మంది గైర్హాజరు అయ్యారన్నారు. జనరల్ విద్యార్థులు 10,005కి 9784 మంది హాజరుకాగా, 221 మంది హాజరుకాలేదన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 2271కి 2195 మంది హాజరుకాగా, 76 మంది హాజరుకాలేదని ఆమె తెలిపారు. కాగా స్థానిక గవరపాలెం మహిళా కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- సోదరుడి పెళ్లి కార్డులు ఇవ్వడానికి వెళుతుండగా ప్రమాదం



సత్యనారాయణ (ఫైల్ ఫొటో)

సబ్బవరం, మార్చి 2: తన సోదరుడి వివాహ శుభలేఖలు బంధువులకు ఇవ్వడానికి బైక్‌పై బయలుదేరిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ప్రమాదం సబ్బవరం మండలంలోని అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగింది. దీనికి సంబంధించి సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కోమటపల్లి గ్రామానికి చెందిన సంగరాతి సింహాచలం, పద్మ దంపతుల కుమారులు ఈశ్వరరావు, సత్యనారాయణ ఉపాధి నిమిత్తం కొంత కాలం క్రితం గాజువాక సమీపంలోని దువ్వాడ వచ్చారు. అక్కడ ఉంటూ దగ్గర్లోని రెస్టారెంట్‌లో వంట మాస్టర్లుగా అన్నదమ్ములు ఇద్దరూ పని చేస్తున్నారు. అన్న ఈశ్వరరావుకు ఈ నెల 27న వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సత్యనారాయణ అనకాపల్లిలో తన స్నేహితుడికి శుభలేఖ ఇవ్వడానికి వెళ్లి రాత్రి అక్కడే ఉండిపోయాడు. బొబ్బిలిలో శుభలేఖలు ఇవ్వడానికి అతను శనివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. సబ్బవరం మండలం ఇరువాడ వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళుతుండగా ఎదురుగా వస్తున్న క్వారీ లారీ అతడిని ఢీకొంది. దీంతో అతను ఎడమ వైపు పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న డంపర్ లారీ అతని పైనుంచి వెళ్లిపోవడంతో శరీరం నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సీఐ సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

110 కిలోల గంజాయి పట్టివేత

రంపపు పొట్టు ముసుగులో రవాణా

- ఎనిమిది మంది అరెస్టు
- రూ.లక్షా మూడు వేల నగదు, 10 సెల్ ఫోన్లు స్వాధీనం



- వార్త 7వ పేజీలో..

క్రైం... crime news

నదిలో పడి రిక్షా కార్మికుడి మృతి


మృతుడు గంపల అప్పారావు

పాయకరావుపేట, మార్చి 2: పట్టణంలోని తాండవ వంతెన పైనుంచి నదిలోకి ప్రమాదవశాత్తూ పడి ఒక వ్యక్తి మృతిచెందాడు. శనివారం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన గంపల అప్పారావు(50) రిక్షా కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 28 సంత్సరాల క్రితం అప్పారావుకు, అతడి భార్యకి మధ్య గొడవలు జరగడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తుని కొండవారపేటలో ఉన్న తన సోదరుడు గంపల దేవుళ్లు ఇంటిలో అప్పారావు ఉంటున్నాడు. మద్యానికి అలవాటుపడిన అప్పారావు మద్యం సేవించినపుడు తుని, పాయకరావుపేటల మధ్య ఉన్న తాండవ వంతెనపైనా, లేదా తుని రైల్వే గెస్టు హౌస్ వద్ద రిక్షాపెట్టి అందులోనే పడుకునేవాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించిన మైకంలో తాండవ వంతెనపై నుంచి వెళుతూ ప్రమాదవశాత్తూ తాండవ నదిలోకి పడిపోయి మృతిచెంది ఉంటాడని మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎస్ఐ రామారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

అడ్డరోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

- దగ్గరలోని పాత హైవేపై రక్తపు మరకలు
- ఎవరో చంపి పడేసి ఉంటారనే కోణంలో పోలీసుల దర్యాప్తు
- క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాల సేకరణ


మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం బృందం


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఎస్.రాయవరం, మార్చి 2: మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారి పక్కనే గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే హైవేపై అడ్డరోడ్డు జంక్షన్ సమీపంలో శనివారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. వెంటనే ఈ సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. సమాచారం అందుకున్న వెంటనే సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు, సిబ్బంది మృతదేహం ఉన్న ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఆ ప్రాంతానికి సమీపంలో పాత జాతీయ రహదారిపై రక్తపు మరకలు ఉండడంతో ఎవరో అతడిని చంపి పడేసి ఉంటారనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలతో మధ్యాహ్నం వరకు ఆధారాలు సేకరించారు. అక్కడికి సమీపంలో ఉన్న సీసీ ఫుటేజ్‌ను కూడా పరిశీలిస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు. అలాగే మృతి చెందిన వ్యక్తి ఎవరన్నది తెలియకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలానికి పాయకరావుపేట, నక్కపల్లి సీఐలు, కోటవురట్ల ఎస్ఐ కూడా చేరుకొని పరిశీలించారు.

రైలు ప్రమాదంలో గాజువాక వాసి మృతి

ఎలమంచిలి, మార్చి 2 : ఎలమంచిలి ఫ్లైఓవర్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి గాజువాక ప్రాంతానికి చెందిన గజగంటరావు సంతోష్ కుమార్(36)మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మృతుడు సంతోష్ కుమార్ వారం రోజుల క్రితం తమిళనాడు రాష్ట్రానికి వెల్డింగ్ పనులు చేసేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి, ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారని తెలిపారు. ప్రమాదం గురించి బంధువులకు సమాచారం అందించామని, మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందన్నారు.

డాక్‌యార్డు ఉద్యోగి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 2: స్థానిక భీమునిగుమ్మంకు చెందిన డాక్‌యార్డు ఉద్యోగి గొర్లి దివాకర్ (32) శనివారం మృతి చెందిన సంఘటన పై ఆయన సోదరుడు శ్యామ్ దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. అవివాహితుడైన దివాకర్ డాక్‌యార్డులో ఉద్యోగం చేస్తూ తన మేనత్త ఇంట్లో ఉంటున్నారు. శుక్రవారం విధులకు వెళ్లి రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం ఆరు గంటలకు కాఫీ తాగిన అనంతరం బయటకు వెళ్లి వచ్చాడు. ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో నోటి నుంచి నురగలు రావడాన్ని చూసిన మేనకోడలు ఇంట్లో వారికి చెప్పగా హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మానసిక ఆందోళనకు మనస్తాపానికి గురై ఉంటాడని, అనారోగ్యం కారణంగానే చనిపోయి ఉంటాడని భావిస్తూ మృతుడు సోదరుడు శ్యామ్ దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహ్మద్ ఆలీతెలిపారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 2 : మండలంలోని తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన సూరాడ రాజు, సూరాడ మసేనులను 20 క్వార్టర్ మద్యం సీసాలతో శనివారం రాత్రి పట్టుకున్నట్టు పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు


సారా బట్టీ ధ్వంసం చేస్తున్న ఎస్ఐ

బుచ్చెయ్యపేట, మార్చి 2 : కొండపాలెంలో సారా బట్టీపై ఎస్ఐ డి.ఈశ్వరరావు శనివారం సిబ్బందితో దాడి చేశారు. ఇరవై లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఆరు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే, నాటుసారా కాస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

900 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

పాయకరావుపేట రూరల్, మార్చి 2 : మండలంలోని ఈదటం గ్రామ శివారులో నాటు సారా బట్టీపై శనివారం పోలీసులు దాడి చేసి 900 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి సీఐ పి.అప్పలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఈదటం గ్రామ శివార్లలో సారా తయారీపై అందిన పక్కా సమాచారం మేరకు పాయకరావుపేట పోలీసులు దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన నిందితులు పారిపోయారని, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 900 లీటర్ల బెల్లం పులుసును గుర్తించి, ధ్వంసం చేశామని సీఐ అప్పలరాజు తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దాడిలో ఎస్ఐ జోగారావు తదితరులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లు

- రికార్డులు తీసి చూస్తే నియోజకవర్గానికి తాను చేసిన అభివృద్ధి తెలుస్తుంది
- జగన్ పాలనలో దళితులపై దాడులు అధికం
- మాజీ మంత్రి అయ్యన్న వెల్లడి
- ఎస్సీ కాలనీలో వైసీపీ నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరికలు


టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో అయ్యన్నపాత్రుడు, విజయ్

నర్సీపట్నం, మార్చి 2: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు తెరిపిస్తామని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. మునిసిపాలిటీ పరిధిలోని మూడో వార్డు ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు గుడాల అప్పారావు, లలిత, గెడ్డం రామన్న, ఎంఆర్‌పీఎస్ లోకేశ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఆ పార్టీకి చెందినవారు శనివారం ఇక్కడ టీడీపీలో చేరారు. వీరందరికీ అయ్యన్నపాత్రుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అన్న క్యాంటీన్లు పెట్టి రూ.5కే అన్నం పెట్టారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్ దుర్మార్గంగా తీసేశారని విమర్శించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఎదురుగా పెట్టిన అన్న క్యాంటీన్ తీసేస్తే తాను 224 రోజులుగా రూ.2లకే అన్నం పెడుతున్నానని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే గణేశ్ నా వయస్సుకి గౌరవం ఇవ్వకుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. నర్సీపట్నానికి తాను ఏం చేశానో రికార్డులు తీసి చూస్తే తెలుస్తుంది ఎమ్మెల్యేనుద్దేశించి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ , ఏరియా ఆస్పత్రి, జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాల, బాలయోగి గురుకుల పాఠశాల, ఏపీఆర్ఎస్, మాకరపాలెంలో అవంతి ఇంజనీరింగ్ కళాశాల టీడీపీ హయాంలో ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పుడు ఏరియా ఆస్పత్రి దిక్కు మాలిపోయిందని, కరెంటు పోతే జనరేటర్‌లోకి ఆయిల్ పోయడానికి డబ్బులు లేవని డాక్టర్లు అంటున్నారని విమర్శించారు. నర్సీపట్నంలో 2300 మందికి చంద్రబాబు టిడ్కో గృహాలు మంజూరు చేస్తే, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో లబ్ధిదారులకు అప్పగించ లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంక్ రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 16 కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారని, వాటిలో నిర్భయ కేసు కూడా ఉందని వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేల మంది దళితులపై దాడులు జరిగాయని, 30 మందిని చంపేశారని ఆరోపించారు. రూ.33వేల కోట్లు సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లించారని, ఎస్సీ, ఎస్సీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ఉద్యోగాలు రాని వారికి నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తారని తెలిపారు. ప్రతీ ఇంటికి ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, ఇంట్లో చదువుకుంటున్న పిల్లలకు రూ.15వేలు, ప్రతీ మహిళలకు నెలకు రూ.1500 చొప్పున అందజేస్తారని, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తారని హామీ ఇచ్చారు. రాష్ట్రం కోసం, మన ప్రాంతం కోసం టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, నేతల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంపౌండబుల్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 2: ఈనెల 16వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కంపౌండబుల్ కేసులను ప్రత్యేక ప్రణాళికతో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మోనటరింగ్ సెల్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. రాజీ చేసుకోదగిన కేసుల్లో ఉభయపక్షాల వారిని లోక్‌అదాలత్‌లో ప్రవేశపెట్టడం వల్ల ప్రజలకు సమయం, డబ్బు వృథా కాకుండా చేయగలిగిన వారవుతామన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో అనుసంధానంగా ఉంటూ కేసుల్లో కన్విక్షన్ శాతం పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్ఐఆర్ నుంచి చార్జిషీటు వరకు జరిగే ప్రక్రియ కోర్టు విచారణ దశలో సమన్లు, ఎన్‌బీడబ్ల్యు సంబంధించిన వ్యక్తులకు సర్వే చేసే విధంగా స్థానిక ఎస్‌హెచ్‌వోలకు తెలపాలన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణమూర్తి, సీఎంఎస్ ఎస్ఐ రామారావు, కోర్టు కానిస్టేబుళ్లు, మోనటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రంపపు పొట్టు ముసుగులో గంజాయి రవాణా

- గుట్టును ఛేదించిన రావికమతం
- ఎనిమిది మంది అరెస్టు
- 110 కిలోల గంజాయి.., రూ.లక్షా మూడు వేల నగదు స్వాధీనం


పట్టుబడిన గంజాయిని చూపుతున్న సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ, సిబ్బంది

రావికమతం, మార్చి 2 : రంపపు పొట్టు ముసుగులో గంజాయిని తరలిస్తున్న ముఠాను రావికమతం పోలీసులు చాకచక్యంగా పట్టుకుని గుట్టు రట్టు చేశారు. ఇందుకు సంబంధించి కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు శనివారం విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలివి. రావికమతంలో స్వీట్ షాపు నడుపుతున్న గంజి సత్తిబాబు మాడుగుల మండలం తిరువాడ గ్రామానికి చెందిన జుత్తాడ రాము ద్వారా స్వీట్లు తయారు చేసే పొయ్యిలోకి ఉపయోగించే రంపపు పొట్టుతో కలిపి గంజాయిని రావికమతం తీసుకు వచ్చి దానిని సత్తిబాబు స్వీట్ షాపులో భద్రపర్చి తమిళనాడు వ్యాపారులకు అమ్ముతున్నట్టు పోలీసులకు స్పష్టమైన సమాచారం అందింది. ఈ మేరకు రావికమతం ఎస్ఐ ధనుంజనాయుడు నిఘా వేశారు. శుక్రవారం రాత్రి వినియోగదారుల వలే మఫ్టీలో స్వీట్లు తయారు చేసే ఇంటిని పోలీసులు చుట్టిముట్టారు. ఎస్ఐ లోపలకు ప్రవేశించే సరికే రంపపు పొట్టు నుంచి గంజాయిని వేరు చేసి రెండు కిలోల చొప్పున ప్యాకింగ్ చేస్తుండగా ఇద్దర్ని పట్టుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకొని వీరి సెల్ ఫోన్ ద్వారా స్ట్రింగ్ ఆపరేషన్ చేశారు. ఈ గంజాయితో సంబంధం ఉన్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. స్వీట్ షాపు యజమాని సత్తిబాబుతో పాటు మాడుగుల మండలం సత్యవరానికి చెందిన వాకాడ ఏసుకుమార్, సాగరం గ్రామానికి చెందిన వంజివంజల నాగరాజు, ఎలమంచిలి మండం గొల్లపాలేనికి చెందిన కోన అప్పలరాజు, తమిళ నాయుడుకు చెందిన సభాపతి గణేశ్, కోదండరాం రూపేష్‌లు పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి కూలీలతో కాలి నడకమార్గం ద్వారా దిగువకు తిరువాడ గ్రామానికి గంజాయిని చేర్చుతున్నట్టు సీఐ వివరించారు. ఇక్కడి నుంచి రంపపు పొట్టు మధ్యలో పెట్టి సరఫరా చేస్తున్నారన్నారు. రావికమతం స్వీట్ షాపులో రెండు కిలోలు చొప్పున ప్యాకింగ్ చేస్తుండగా నిందితులను పట్టుకుని అరెస్టు చేసినట్టు సీఐ చెప్పారు. వీరి నుంచి రూ. లక్షా మూడు వేల నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ ధనుజయనాయుడు పాల్గొన్నారు.

కొణతాలను కలిసిన గెడ్డం బుజ్జి


అనకాపల్లిలో కొణతాలతో మాట్లాడుతున్న బుజ్జి, జనసేన నాయకులు

పాయకరావుపేట రూరల్, మార్చి 2: అనకాపల్లి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణను శనివారం పాయకరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి మర్యాదపూర్వకంగా అనకాపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, సార్వత్రిక ఎన్నికల గురించి చర్చించినట్టు బుజ్జి తెలిపారు. జనసేన టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టో, వైసీపీ అరాచక పాలనను ప్రజలలోకి తీసుకెళ్లాలని కొణతాల సూచించారన్నారు. గెడ్డం బుజ్జితోపాటు జనసేన నాయకులు యగదాసు నానాజీ, ఆచంట దొర, వెలగా సుధాకర్, పప్పల శివ, సింగపల్లి శ్రీను, జగ్గన్నదొర, పల్లి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ ప్రచారకుడు కామేశ్ మృతి


పిక్కి కామేశ్వరరావు (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, మార్చి 2: మండలంలోని రాజయ్యపేటలో గ్రామ సర్పంచ్ పిక్కి అప్పలనర్స తనయుడు, హిందూ ధర్మ ప్రచారకుడు పిక్కి కామేశ్వరరావు (కామేశ్) తీవ్ర అనారోగ్యంతో శనివారం రాత్రి మరణించారు. సుదీర్ఘకాలం పాటు ఎస్ఎస్ఎఫ్ మండల ధర్మ ప్రచారకుడిగా ఎంతో సమర్థవంతంగా పనిచేశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన కామేశ్వరరావు విశాఖ, హైదరాబాద్, అగనంపూడి తదితర ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి కన్నుమూశారు. ఆదివారం ఉదయం రాజయ్యపేట గ్రామంలో కామేశ్ అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు చెప్పారు. విషయం తెలిసిన వెంటనే తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు కోసూరి శ్రీను, తదితరులు తీవ్ర సంతాపం తెలియ జేశారు.

ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు పరీక్షలు రాయాలి : డీఈవో


విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

అచ్యుతాపురం, మార్చి 2: టెన్త్ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటలక్ష్మమ్మ అన్నారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం అవుతున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేశారు. విద్యార్థులు మంచి ఆహారం తీసుకుంటూ ఎటువంటి భయం, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. మరింత ఉత్సాహంగా పనిచేసి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడానికి కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ వై.వెంకటేశ్వరరావు, హెచ్ఎం ఎం.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఒంటి కన్ను ముచ్చెలతో చెరకు అధిక దిగుబడులు

- ఏడీఆర్ డాక్టర్ జగన్నాథరావు


రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి అగ్రికల్చర్, మార్చి 2: ఒంటి కన్ను ముచ్చులు వాడడం వలన చెరకు అధిక దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. చెరకు సాగులో సాంకేతికతపై ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు శనివారం ఆర్ఏఆర్ఎస్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. 'ఆత్మ' ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి గ్రామీణ యువ రైతులకు ఆధునిక సాంకేతికతపై శిక్షణనిచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కేవీ రమణమూర్తి సేంద్రియ విధానంలో చెరకు సాగుపై శిక్షణనిచ్చారు. బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతులు తమ ఆదాయాలను పెంచుకోవచ్చని ప్రధాన ఇంజనీరింగ్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి వివరించారు. శిక్షణ పొందిన రైతులకు ఏడీఆర్, ఆశాదేవి, రమణమూర్తి సర్టిఫికెట్లు అందజేశారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

నర్సీపట్నం, మార్చి 2: కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని పెదబొడ్డేపల్లి ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 5 ,6, 7, 8 తరగతులలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వీవీ రాజేంద్ర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా వివిధ కేటగిరీలలో నిర్దేశించిన రిజర్వేషన్ ప్రక్రియ పాటిస్తూ ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని వివరించారు. దరఖాస్తుకు ఈ నెలాఖరు వరకు గడవు ఉందని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా కోరారు.

అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు బదిలీ



అనకాపల్లి టౌన్, మార్చి 2 : అనకాపల్లి డీఎస్పీ వి. సుబ్బరాజుకు బదిలీ అయ్యింది. గతేడాది ఏప్రిల్ 29న ఈయన అనకాపల్లి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈయన్ని విజయవాడ ఏసీబీకి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో విశాఖ నగర పరిధిలోని ఇంటిలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్. అప్పలరాజు నియమితులయ్యారు. మరికొద్ది రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

గుణుపూర్ ప్రత్యేక పాసింజర్ తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, మార్చి 2: వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ, పర్లాకిమిడి స్టేషన్ల మధ్య పవర్ బ్లాక్ పనుల నేపథ్యంలో విశాఖ, గుణుపూర్ మధ్య నడుస్తున్న 08522, 08521 నంబర్లు గల ప్రత్యేక పాసింజర్ రైళ్లను ఈనెల 3, 6, 10, 13, 17, 20, 24, 27, 31వ తేదీల్లో తాత్కాలిక రద్దు చేశామని సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రయాణికులు ఈ విషయం గుర్తించాలని కోరారు.

7న ప్రధానితో 'ప్రసాద్' పనులకు శంకుస్థాపన

సింహాచలం, మార్చి 2 : సింహగిరిపై కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం నిధులతో చేపట్టనున్న పనులకు ఈనెల 7న ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నట్టు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. ఆ కార్యక్రమానికి కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా హాజరు కానున్నట్టు చెప్పారు. కేంద్రం సింహాచల దేవస్థానానికి రూ.54.4 కోట్లు, అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానానికి రూ.20 కోట్లు ప్రసాద్ పథకం కింద మంజూరు చేసిందన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి వెండి కవచం అలంకరణ



అనకాపల్లి టౌన్, మార్చి 2 : స్థానిక విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామికి, సిద్ధప్ప విగ్రహాలకు శనివారం భక్తుల విరాళాలతో తయారు చేసిన ఎనిమిది కిలోల వెండి కవచాలను అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల ఎనిమిదో తేదీన వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం జరగనుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు, అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి ఎం.రామకృష్ణ స్వామివారికి పూజలు చేశారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

అనకాపల్లి టౌన్, మార్చి 2 : పశ్చిమ బెంగాల్‌లో ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న లైంగిక దాడులను నిరసిస్తూ బీజేపీ నాయకులు శనివారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బెంగాల్‌లో సందేశ్ ఖలీ సంఘటనలు నిరసించారు. అక్కడ పాలక తృణముల్ కాంగ్రెస్ నేతలు గుండాల మాదిరిగా మహిళలపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. వారి భూములను కబ్జా చేస్తూ దారుణ నిర్బంధాలకు గురిచేస్తున్న టీఎంసీ నాయకుడు షేక్ షాజహాన్‌ను, అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో గంగాధరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కొండబాబు, కర్రి రామకృష్ణ, పట్టాభి ప్రసాద్, బొడ్డేడ నాగేశ్వరరావు, స్వరూప్, కొణతాల అప్పలరాజు, ధరిమిశెట్టి నారాయణరావు, వుడా రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్ష

అనకాపల్లి టౌన్, మార్చి 2: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని నిరసిస్తూ స్థానిక కోర్టు వద్ద శనివారం అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు దీక్ష కొనసాగించారు. ఈ దీక్షలో ఎ.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, జీఆర్ఎస్ కుమార్, డి.రాంప్రసాద్, కె.చిట్టినాయుడు కూర్చున్నారు. ప్రభుత్వం చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీరి దీక్షకు న్యాయవాదులు సంఘీభావం తెలిపారు.

పిల్లల భవిష్యత్తుకు ఉన్నతంగా ఆలోచించాలి : దాడి

అనకాపల్లి టౌన్, మార్చి 2: తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును ఉత్తమంగా ఆలోచించి ముందడుగు వేయాలని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ సూచించారు. శనివారం కళాశాలలో జరిగిన డిప్లమో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువు గురించి ఎప్పటికప్పుడు అధ్యాపకులను అడిగి తెలుసుకోవాలన్నారు. సమావేశంలో డిప్లమో కో-ఆర్డినేటర్ ఎస్.సరితారాణి, డాక్టర్ కె.సుజాత, డాక్టర్ పూర్ణప్రియా, డాక్టర్ గోపాలమ్మ పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించండి : యూటీఎఫ్

అనకాపల్లి టౌన్, మార్చి 2: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని శనివారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతిని కలిసి వినతిపత్రం ఇచ్చినట్టు యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించామన్నారు. ఉద్యోగుల సమస్యలను త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీ తెలిపారన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వత్సవాయి శ్రీలక్ష్మి, రాజేష్, మారిశెట్టి వెంకటఅప్పారావు, గొంది ఈశ్వర్, హేమకుమారి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీను కుటుంబానికి పీలా రూ.లక్ష ఆర్థిక సాయం



శ్రీను కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న పీలా గోవింద

కొత్తూరు, మార్చి 2 : అనకాపల్లి మండలం సుందరయ్యపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బాదపు శ్రీను కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. శనివారం గ్రామంలో జరిగిన పెద్దకర్మ కార్యక్రమంలో పీలా పాల్గొని ఆ నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అంతకు ముందు శ్రీను అంత్యక్రియలకు రూ.10వేలు అందజేశామన్నారు. ఈ విషయాన్ని నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి ఆ కుటుంబానికి సహాయం అందజేస్తామని తెలిపారు.

నేడు తంతడి రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

అచ్యుతాపురం, మార్చి 2: తంతడి రామాలయంలో శనివారం ఉదయం విశ్వక్షేణపూజ, పుణ్యాహవాచనం, వాస్తు మండపారాధన వంటి క్రతువులు వేదపండితులు జరిపించారు. ఆదివారం ఉదయం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ఖండ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు, చోడిపల్లి సత్యం పాల్గొన్నారు.

'పరిశ్రమల కృషి అభినందనీయం'

అచ్యుతాపురం, మార్చి 2: గ్రామాల అభివృద్ధికి సెజ్‌లోని కర్మాగారాలు చేస్తున్న కృషి అభినందనీయమని ఎలమంచిలి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి రాజు అన్నారు. శనివారం సాయంత్రం సెజ్‌లోని ఐఓసీఎల్ పైప్‌లైన్ టెర్మినల్‌ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి మున్సిపాలిటీకి ఐఓసీఎల్ ఒక ఎక్స్‌కవేటర్‌ని అందజేసింది. అంతకుముందు అచ్యుతాపురంలో భూపట్టాల పంపిణీతోపాటు నాయీ బ్రాహ్మణుల క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రపంచ వణ్యప్రాణి దినోత్సవం

ఎలమంచిలి, మార్చి 2: స్థానిక ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ప్రపంచ వణ్యప్రాణి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ పీవో అర్జున అప్పారావు మాట్లాడుతూ వణ్య ప్రాణుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.సుజాత, పీవో చిట్టిబాబు పాల్గొన్నారు.

నేడు పంచదార్ల ఆలయంలో విజయ హోమం

రాంబిల్లి, మార్చి 2: మండలంలోని పంచదార్ల ద్విముఖ వినాయకుని ఆలయంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలని విజయ హోమాన్ని నిర్వహిస్తున్నట్టు భగవత్ భక్తిప్రచార ట్రస్టు కార్యదర్శి బి.శ్రీరామూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 7 మండలాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు.

ఘనంగా బయ్యవరం దర్గాలో ఉరుసు

» బాబాను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

కశింకోట, మార్చి 2 : మండలంలోని బయ్యవరం హజరత్ అన్సర్ మదని ఔలియా దర్గాలో ఉరుసు (చందనోత్సవం) శనివారం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామున నుంచి దర్గాలో ఖురాన్‌ఖానీ, మిలాద్ షరీఫ్ ప్రారంభమైంది. సాయంత్రం దర్గా వద్ద ఏర్పాటు చేసిన ఖవ్వాలి ఈ ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో గ్రామ ప్రధాన రోడ్డు భక్తులతో కిక్కిరిపోయింది. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మత పెద్దలు ముతవల్లి జనాబ్ అబ్దుల్ హకీమ్, కార్యదర్శి జనాబ్ మహమ్మద్ అయాజ్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్గాలో ఉన్న బాబా సమాధి వద్ద మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ఆశీర్వాదాలు అందజేశారు.



బాబా సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద



బాబా సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న టీడీపీ నాయకులు దాడి రత్నాకర్

అనకాపల్లిలో కేంద్ర బలగాలు కవాతు

అనకాపల్లి టౌన్, మార్చి 2 : రానున్న సార్వత్రిక ఎన్నికలకు బందోబస్తు విధులు నిర్వహించేందుకు వచ్చిన కేంద్ర బలగాలు శనివారం సాయంత్రం పట్టణంలో కవాతు నిర్వహించాయి. జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల నుంచి మెయిన్‌రోడ్డు, పెరుగుబజార్ జంక్షన్, సంతోషిమాత ఆలయం, దిబ్బవీధి, అగ్గిమర్రి చెట్టు, వేగివీధి, కూరగాయల మార్కెట్, ఎన్టీఆర్ వైద్యాలయం, ఎన్టీఆర్ స్టేడియం మీదుగా కవాతు నిర్వహించారు.

ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేందుకు కేంద్ర బలగాలు ఈ కవాతును నిర్వహించాయి సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సనత్ కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ అమిత్‌కుమార్, పట్టణ సీఐ జి. శంకరరావు, ఎస్ఐ మహ్మద్ ఆలీ, రిజర్వు ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి, ఆర్ఎస్ఐ భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

మాజీ సైనికులకు ఎస్పీ అభినందనలు



మాజీ సైనికులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 2 : సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన 19 మంది మాజీ సైనికులను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అభినందించారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీ స్ఫూర్తితో మరింత మంది మాజీ సైనికులు, ఇతర కేంద్ర పోలీస్ దళాల్లో పనిచేసి రిటైర్ అయిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎన్నికల విధుల్లో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే మాజీ సైనికులకు, కేంద్ర పోలీస్ దళాల్లో పనిచేసిన వారికి రవాణా, భోజన సౌకర్యం సమకూర్చడంతోపాటు గౌరవ వేతనం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.

స్వచ్ఛందంగా సేవలందించాలనుకున్న మాజీ సైనికులు, కేంద్ర పోలీస్‌బలగాలలో పనిచేసిన వారు 8500361036, 9440796086 సెల్ నంబర్లకు సంప్రదించాలని కోరారు. ఎస్బీ డీఎస్పీ అప్పారావు, ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు పాల్గొన్నారు.

కోడూరులో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభం

అనకాపల్లి రూరల్, మార్చి 2 : మండలంలోని కోడూరులో రూ. 40.57 కోట్లతో నిర్మించిన ఎంఎస్ఎంఈ పార్కును రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రికార్డు సమయంలో ఈ పార్కును నిర్మించి, అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అనకాపల్లి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోడూరు వద్ద 59.47 ఎకరాల స్థలంలో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేశామన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



పార్కు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గం

పాయకరావుపేట, మార్చి 2 : గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పాయకరావుపేటలో నూతన శాఖను ఏర్పాటు చేసింది. శనివారం సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నూతన శాఖను ప్రారంభించడంతోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ బాడీ చైర్మన్‌గా బి.చినబాబు, కో-చైర్మన్‌గా కొత్తపల్లి చిట్టిబాబు, కన్వీనర్‌గా వై.వెంకటసత్యప్రసాద్, డైరెక్టర్లుగా తోట నగేశ్, గూటూరు శ్రీనివాసరావు, పెదిరెడ్డి చిట్టిబాబు, పచ్చిగోళ్ల రాజబాబు, కంభంపాటి రమణ, దాసరి రాజ్‌కుమార్, సంస్థ అధ్యక్షుడిగా టెక్కలి రామకృష్ణ, కార్యదర్శిగా మొల్లేటి నారాయణమూర్తి తదితరులను ఎంపిక చేశారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. తర్వాత పాయకరావుపేట శాఖకు శాంతి రథం, మార్చురీ ఫ్రీజర్‌ని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ కోడూరు రాధాసత్యవతి, ధనిశెట్టి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ



పరవాడలో పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరవాడ, మార్చి 2 : ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి జయశ్రీకర్నిషా పిలుపునిచ్చారు. శనివారం పల్స్ పోలియోపై స్థానిక హైస్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయిరాం, సీహెచ్ఎస్ జానకిరామన్, సూపర్‌వైజర్లు సతీష్‌కుమార్, వీవీ రత్నం పాల్గొన్నారు. అలాగే వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి కనకఅప్పారావు ఒక ప్రకటనలో కోరారు. పీహెచ్‌సీ పరిధిలో 1,782 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొత్తం 80 పోలియో కేంద్రాలను, రెండు మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

65 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు

నక్కపల్లి, మార్చి 2: మండలంలోని గొడిచెర్ల పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం పల్స్ పోలియో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుకన్య చెప్పారు. పీహెచ్‌సీ పరిధిలో 65 పల్స్ పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేశామని, 6,153 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. శనివారం గొడిచెర్లలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

పల్స్‌పోలియోని సద్వినియోగం చేసుకోవాలి

రాంబిల్లి, మార్చి 2 : స్థానిక పీహెచ్‌పీ పరిధిలో ఆదివారం 1,578 మంది పిల్లలకు పోలియోచుక్కలు వేయనున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఉదయం 7 గంటలు నుంచి సాయంత్రం 6 గంటల వరకు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని, ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

2,186 మంది పిల్లలకు పోలియో చుక్కలు లక్ష్యం

కోటవురట్ల, మార్చి 2: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం 2,186 పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్టు వెంకటాపురం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్. సంతోష్‌కుమార్ తెలిపారు. పోలియో కేంద్రాల పర్యవేక్షణ కోసం ఒక మొబైల్ టీమ్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ప్రతి కేంద్రానికి నలుగురు చొప్పన సిబ్బందిని నియమించినట్టు ఆయన తెలిపారు. వైద్యఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పోలియోకేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తారన్నారు,

కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలి



గోపాలపట్నం సచివాలయం వద్ద కల్వర్టుకు రక్షణ గోడలు లేని దృశ్యం

పాయకరావుపేట రూరల్, మార్చి 2 : మండలంలోని గోపాలపట్నం సచివాలయం వద్ద సాగునీటి కాలువపై నిర్మించిన కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. రక్షణ గోడలు లేక కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలు, వృద్ధులు, దివ్యాంగులు సచివాలయానికి వస్తుంటారని, ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందన్నారు. నాయకులు, అధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గైరమ్మను దర్శించుకున్న టీడీపీ నేతలు

కశింకోట, మార్చి 2: మండల కేంద్రంలో గైరమ్మ పండుగ శనివారం ఘనంగా జరిగింది. గౌరీపరమేశ్వరులకు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణలు వేర్వేరుగా ఉత్సవమూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు జగదీశ్వరరావును శాలువాతో సత్కరించారు.

'కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం'

పాయకరావుపేట, మార్చి 2 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యమవుతుందని ఆ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకులు ఎంవీఆర్.రాహుల్ అన్నారు. శనివారం పట్టణ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా వైఎస్.షర్మిల బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఉత్తేజం వచ్చిందన్నారు. అనంతరం మండలంలోని ఎస్.నర్సాపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి నారాయణ చక్రవర్తి, నాయకులు మోర్త సింహాచలం, ప్రగడ చక్రరావు, మురుకుర్తి గంగరాజు, సుంకర సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రాహుల్‌ని సత్కరిస్తున్న జగతా శ్రీనివాస్ తదితరులు

'టెన్త్‌లో శతశాతం ఫలితాలు సాధించాలి'

నక్కపల్లి, మార్చి 2: టెన్త్‌లో నూరుశాతం ఫలితాలను సాధించాలన్న ఏకైక లక్ష్యంతోనే విద్యాబోధన జరుగుతోందని ఎంఈవో కె.నరేశ్ చెప్పారు. శనివారం రాత్రి స్థానిక కేజీబీవీలో టెన్త్ బాలికలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. ఏయే సబ్జెక్టుల్లో ఏ బాలికలు వెనుకబడ్డారో గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాలికల నోట్ పరిశీలించారు. పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి వత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని బాలికలకు సూచించారు. కేజీబీవీ ఎస్‌వో సలీమా, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, పెదబోదిగల్లం హైస్కూల్ తెలుగుపండిట్ ఎస్‌వీఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.



టెన్త్ బాలికల అదనపు తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో నరేశ్

మైహోమ్ ఉచిత వైద్య శిబిరంలో 634 మందికి పరీక్షలు

ఎలమంచిలి, మార్చి 2: ములకలాపల్లి మైహోమ్ సిమెంటు పరిశ్రమ ఆధ్వర్యంలో శనివారం ఏటికొప్పాక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 634 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్టు పరిశ్రమ జీఎం(ఆపరేషన్స్)బి.రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెమోగ్లోబిన్, కళ్లు, దంతములు, గైనిక్, సాధారణ సమస్యలపై ప్రముఖ వైద్య నిపుణులచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీజీఎం(పీఅండ్ఏ) ఎల్.శ్రీనివాసరావు, వైద్యులు సాంబమూర్తి, నరేష్, డాక్టర్.ప్రియ పాల్గొన్నారు.

'విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు శ్రమించాలి'

ఎలమంచిలి, మార్చి 2: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో లక్ష్య సాధన కోసం శ్రమించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీపీ బోదెపు గోవింద్ విద్యార్థులకు సూచించారు. శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు ఉన్నత పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన నమూనా పరీక్షలో విజేతలకు ఎంపీపీ గోవింద్, ఎంఈఓ మీనాక్షి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్ర, ఉపాధ్యాయ సంఘ నేతలు ప్రసాద్, కౌశిక్, చరణ్ పాల్గొన్నారు.



పది విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసిన ఎంపీపీ గోవింద్, ఎంఈఓ మీనాక్షి

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి : ఎస్పీ



కళాశాలను సందర్శిస్తున్న జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ

సబ్బవరం, మార్చి 2: ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. శనివారం ఆయన స్థానిక గురుకుల కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించారు. సీసీ కెమెరాలు పనిచేస్తున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. కాగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 245 మంది విద్యార్థులు హాజరుకావలసి ఉండగా 9 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ సత్యారావు తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట స్థానిక సీఐ పిన్నింటి రమణ ఉన్నారు.

ఐదున టీడీపీ బీసీ డిక్లరేషన్

తుమ్మపాల, మార్చి 2: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఈనెల ఐదో తేదీన మంగళగిరిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించనున్నారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర మాజీ కార్యదర్శి గుడాల సత్యనారాయణ తెలిపారు. ఎన్నికల తరువాత ఏర్పడనున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో బీసీలకు న్యాయం చేయాల్సిన పలు అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి బీసీ విభాగం నాయకులు పాల్గొంటారని తెలిపారు.

వైభవంగా రావాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

సబ్బవరం, మార్చి 2: మండలంలోని మలునాయుడు పాలెంలో పునర్నిర్మించిన రావాలమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ శనివారం సర్పంచ్ బొని దేముడమ్మ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వీకెపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్టీ రామకాసు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, ఎంపీటీసీ సభ్యుడు గొర్లి కనకరాజు పూజలు చేశారు. మధ్యాహం అన్నసంతర్పణ జరిగింది.

ఘనంగా సరోజినీ నాయుడు వర్ధంతి

కశింకోట, మార్చి 2 : మండలంలోని సోమవరం గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు, కవయిత్రి సరోజిని నాయుడు వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజినినాయుడు చిత్రపటానికి గ్రామ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి ఉగ్గిన రమణమూర్తి, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, మాజీ సర్పంచ్ కర్రి దుర్గునాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

కశింకోట, మార్చి 2: మండల కేంద్రంలోని కస్పావీధిలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, వైద్య సిబ్బందికి ఓటరు నమోదుపై డీటీ సురేష్‌నాయుడు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీ సత్యనారాయణ, వీవోఏ వరలక్ష్మి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



బుద్ద నాగజగదీష్‌ను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

కశింకోట, మార్చి 2 : మండలంలోని నర్సింగబిల్లి, జట్టపురెడ్డితుని, చింతలపాలెం గ్రామాల్లో వెంకటేశ్వరస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళీ, సర్పంచులు కోన అరుణ, కొట్టే రాము, ఎంపీటీసీ సభ్యులు షేక్ దర్గా, కసిరెడ్డి కన్నయ్య, మజ్జి ప్రసాదరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, మార్చి 2 : స్థానిక పాత్రుడుకాలనీలోని సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అలాగే సిద్దిబుద్ది వినాయక స్వామివారి వార్షిక కల్యాణాన్ని నిర్వహించారు. టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ హాజరై గణనాథుని కల్యాణంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పీలా బాబు, కొమ్మనాపల్లి వాసు, కె. నూరిబాబు, రేబాక ఇంద్రకుమార్, సిద్దార్థ పాల్గొన్నారు.

మహా పాదయాత్రను జయప్రదం చేయాలి

పరవాడ, మార్చి 2 : కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పాదయాత్రకు సంబంధించి కరపత్రాలను శనివారం సింహాద్రి ఎన్టీపీసీ కార్మికులతో కలిసి సంస్థ మెయిన్ గేటు వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.గోవిందరాజు, పీపీ నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్నను దర్శించుకున్న శీరం



వెంకన్నను దర్శించుకుంటున్న శీరం నరసింహమూర్తి,రామారావు

నక్కపల్లి, మార్చి 2: ఇటీవల ప్రమాదానికి గురై, కోలుకున్న వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి శనివారం ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 108 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈయనతోపాటు జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు యలమంచిలి తాతబాబు, సిద్దాబత్తుల నూకతాత, సూరకాసుల గోవింద్ స్వామివారిని దర్శించుకున్నారు.

130 రోజుకు చేరుకున్న రైతుల నిరసన

రాంబిల్లి, మార్చి 2: తమ పొలాలకు దారి లేకుండా ప్రహరీ గోడను నిర్మించవద్దంటూ పెదకలవలాపల్లి రైతులు చేస్తున్న నిరసన దీక్షలు శనివారానికి 130వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు రావి దేముళ్లు మాట్లాడుతూ.. రైతులకు ప్రత్యామ్నాయం చూపించకుండా దారి మూసివేయడం అన్యాయమన్నారు.

రాచపల్లి ఘటనపై విచారణ

- నిందితుడ్ని అరెస్టు చేసి, అట్రాసిటీ కేసు నమోదు
- పెద్ద కుమార్తె, భార్య సోదరి నుంచి డీఎస్పీ వివరాల సేకరణ
- కాలిన గాయాలతో ఉన్న చిన్నకూమార్తె పరిస్థితి విషమం
- చికిత్సల ద్వారా కోలుకుంటున్న మిగిలిన ఇద్దరు


రాచపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను విచారిస్తున్న డీఎస్పీ

మాకవరపాలెం, మార్చి 2 : మండలంలోని రాచపల్లి గ్రామంలో ఓ భర్త దారుణానికి పాల్పడిన ఘటనపై నర్సీపట్నం డీఎస్పీ మోహన్ శనివారం విచారణ చేపట్టారు. రాచపల్లిలో నివాసం ఉంటున్న తుంగళ్ల రమణ తన భార్య విజయ్‌తో గొడవ పడడం, కుటుంబ సభ్యులైన భార్య, కుమార్తె శ్రీకావ్యతో పాటు అత్త కృష్ణమ్మ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గురువారం రాత్రి పదకొండు గంటల సమయంలో పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. కాలిన గాయాలతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వీరు ప్రస్తుతం చికిత్సలు పొందుతున్నారు. ఈ ముగ్గురిలో రమణ కుమార్తె పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెపుతున్నారు. ఆమె పొట్టపైన, ఛాతిపైన కాలిన గాయాలు ఎక్కువుగా ఉండడంతో ఆసుపత్రిలో వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో శ్రీకావ్యకు పల్స్‌రేటు పడిపోతుందని వైద్యాధికారులు తెలపడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పోలీసుల అదుపులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ.రామకృష్ణారావు తెలిపారు. అతడిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణను డీఎస్పీ చేపట్టారు. ఘటన జరిగే సమయంలో ఆ పక్క గదిలో పడుకున్న రమణ పెద్ద కుమార్తెతో పాటు అతని భార్య విజయ్ సోదరి నుంచి పలు వివరాలు సేకరించారు. ఈ విచారణలో సీఐ హరి, ఎస్ఐ రామకృష్ణారావు, వీఆర్‌వోలు సింహాద్రి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

'టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే గణేశ్ మోసం'


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, మార్చి 2 : టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ మోసం చేస్తున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్య చంద్ర ఆరోపించారు. శనివారం నర్సీపట్నంలో పార్టీ నాయకులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో టిడ్కో గృహాల గురించి పట్టించుకోలేదన్నారు. ఈ గృహాలకు వైసీపీ రంగులు వేసినప్పటికీ ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆరోపించారు. త్వరలో ఎన్నికలు జరగనున్నందున హడావిడిగా ఇళ్లను పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా ఆ ఇళ్లలో లబ్ధిదారులు ఎలా ఉంటారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అద్దేపల్లి గణేశ్, వెలగల వెంకటరమణ, నమ్మి కొండలరావు, మారిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో కేంద్ర బలగాలు కవాతు


పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

అనకాపల్లి టౌన్, మార్చి 2 : రానున్న సార్వత్రిక ఎన్నికలకు బందోబస్తు విధులు నిర్వహించేందుకు వచ్చిన కేంద్ర బలగాలు శనివారం సాయంత్రం పట్టణంలో కవాతు నిర్వహించాయి. జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల నుంచి మెయిన్‌రోడ్డు, పెరుగుబజార్ జంక్షన్, సంతోషిమాత ఆలయం, దిబ్బవీధి, అగ్గిమర్రిచెట్టు, వేగివీధి, కూరగాయల మార్కెట్, ఎన్టీఆర్ వైద్యాలయం, ఎన్టీఆర్ స్టేడియం మీదుగా కవాతు నిర్వహించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేందుకు కేంద్ర బలగాలు ఈ కవాతును నిర్వహించాయి సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సనత్‌కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ అమిత్‌కుమార్, పట్టణ సీఐ జి. శంకరరావు, ఎస్ఐ మహ్మద్ ఆలీ, రిజర్వు ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి, ఆర్ఎస్ఐ భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించండి : యూటీఎఫ్

అనకాపల్లి టౌన్, మార్చి 2: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని శనివారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతిని కలిసి వినతిపత్రం ఇచ్చినట్టు యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించామన్నారు. ఉద్యోగుల సమస్యలను త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీ తెలిపారన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వత్సవాయి శ్రీలక్ష్మి, రాజేష్, మారిశెట్టి వెంకటఅప్పారావు, గొంది ఈశ్వర్, హేమకుమారి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఎస్పీ అభినందనలు


మాజీ సైనికులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 2 : సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన 19 మంది మాజీ సైనికులను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అభినందించారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీ స్ఫూర్తితో మరింత మంది మాజీ సైనికులు, ఇతర కేంద్ర పోలీస్ దళాల్లో పనిచేసి రిటైర్ అయిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎన్నికల విధుల్లో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే మాజీ సైనికులకు, కేంద్ర పోలీస్ దళాల్లో పనిచేసిన వారికి రవాణా, భోజన సౌకర్యం సమకూర్చడంతోపాటు గౌరవ వేతనం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. స్వచ్ఛందంగా సేవలందించాలనుకున్న మాజీ సైనికులు, కేంద్ర పోలీస్‌బలగాలలో పనిచేసిన వారు 8500361036, 9440796086 సెల్ నంబర్లకు సంప్రదించాలని కోరారు. ఎస్బీ డీఎస్పీ అప్పారావు, ట్రాఫిక్ సీఐ షైదపునాయుడు పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్'తో పేదల బతుకుల్లో వెలుగు

- టీడీపీ ప్రవేశ పెట్టనున్న పథకాలపై విస్తృత ప్రచారం చేయండి
- పార్టీ శ్రేణుల సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తాతయ్యబాబు పిలుపు


పథకాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే రాజు, మల్లునాయుడు తదితరులు

చోడవరం, మార్చి 2 : టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలపై నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆడబిడ్డ, తల్లికి వందనం, దీపం పథకం కింద ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నదాత పథకం ద్వారా రైతులకు అందించే సాయం, యువగళం కింద నిరుద్యోగ భృతి, బీసీలకు రక్షణ చట్టం, పూర్‌టు రిచ్ పథకాలను ప్రజలకు సంపూర్ణంగా వివరించాలన్నారు. వీటి వల్ల పేదల బతుకుల్లో వెలుగులు నిండనున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి విజయమే లక్ష్యంగా అంతా పనిచేయాలన్నారు. అనంతరం పథకాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, గోకివాడ కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు నాలుగు మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరగాలి : బత్తుల

బుచ్చెయ్యపేట : వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరగాలని టీడీపీ చోడవరం నియోజకవర్గ బత్తుల తాతయ్యబాబు డిమాండ్ చేశారు. వడ్డాది పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ లబ్ధికోసమే వివేకానందరెడ్డిని జగన్ ముఠానే హతమార్చి ఉంటుందన్నారు. బాబాయిని చంపిన వారిని జగన్‌రెడ్డి రక్షించడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కర్నూలులో అవినాష్‌ను అరెస్టు చేయడానికి వస్తే ఉద్రిక్త వాతావరణాన్ని వైసీపీ నేతలు ఎందుకు సృష్టించారని ఆయన సీఎంను ప్రశ్నించారు. తన సోదరి వైఎస్ సునీతారెడ్డి అడుగుతున్న ప్రశ్నలకు జగన్‌రెడ్డి అండ్ కో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆడబిడ్డకు న్యాయం చేయలేని సీఎం రాష్ట్రంలోని అక్కాచెల్లెమ్మలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. మన మాన, ధన ప్రాణాలకు రక్షణ ఉండాలంటే సునీతారెడ్డి చెప్పినట్టుగా జగన్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని తాతయ్యబాబు పిలుపునిచ్చారు.


పథకాల కరపత్రాలు పంచుతున్న రాజ్‌కుమార్

'చంద్రబాబు సేవలు రాష్ట్రానికి అవసరం'

మాడుగుల రూరల్ : మండలంలోని జమ్మాదేవిపేట పంచాయతీ శివారు లోవ గవరవరంలో శనివారం తెలుగు యువత మండల అధ్యక్షుడు వడ్డి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చే ప్రజలకు జరిగే మేలు, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన బలపర్చిన అభ్యర్థులను అంతా గెలిపించాలని కోరారు. చంద్రబాబు వంటి సమర్థుడు రాష్ట్రానికి అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో మరింత అప్రమత్తం కావాలి

- బీఎల్‌వోలు, రూట్, సెక్టార్ ఆఫీసర్ల సమావేశంలో నియోజకవర్గ ఆర్‌వో సత్యవాణి


అధికారులకు సూచనలిస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ సత్యవాణి

చీడికాడ, మార్చి 2 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకూ విధి నిర్వహణలో అంతా మరింత అప్రమత్తంగా ఉండాలని ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మాడుగుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ బి.వి.సత్యవాణి ఆదేశించారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్‌వోలు, రూట్ ఆఫీసర్లు, సెక్టార్ ఆఫీసర్లతో ఏర్పాటైన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా మరుగు దొడ్లు, తాగునీరు, విద్యుత్ , ర్యాంప్‌లు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా ఈ సమావేశానికి ఎంతమంది హాజరయ్యారు, ఎంతమంది గైర్హాజరయ్యారు అనేది తెలుసుకున్నారు. గైర్హాజరైన వారిని సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు మాడుగుల తహసీల్దార్ కార్యాలయానికి పంపించాలని తహసీల్దార్ బి.కామేశ్వరరావును ఆదేశించారు. కొందరు బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల్లో సమస్యలను ఆమె దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీ ల్దార్ పొట్నూరి రమేష్, ఎంఈవో కె.బొంజు బాబు, ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుడికి సీఎం సహాయ నిధి అందజేత


బాధితుడికి చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి, మార్చి 2 : మండలంలోని ఎ.కొత్తపల్లికి చెందిన కర్రి అప్పలనాయుడుకు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి పోవడంతో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.ఐదు లక్షల చెక్కును ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం తారువలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల సత్యవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరణలో విప్ ధర్మశ్రీ

చోడవరం, మార్చి 2 : మండలంలోని జన్నవరంలో జ్యోతిబా పూలే పాఠశాలలో భవనాల నిర్మాణానికి విప్ ధర్మశ్రీ శనివారం శంకుస్థాపన చేశారు. అన్ని వసతులతో కూడిన భవనాలను నిర్మించి విద్యార్థులకు అందుబాటులో తేనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ప్రిన్సిపాల్ రత్నకుమారి, ఎంఈవోలు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎంపై ఓటర్లకు అవగాహన సదస్సు


ఈవీఎం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారి

కె.కోటపాడు, మార్చి 2 : ఓటర్లంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ బొడ్డేడ రాంబాబు అన్నారు. చౌడువాడ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల వినియోగంపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఓటు వజ్రాయుధం వంటిదన్న విషయాన్ని అంతా గుర్తించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 65 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఆయా చోట్ల అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పండుగ పేరుతో పింఛన్ల సొమ్ములో కోత

- కుసర్లపూడి మాజీ సర్పంచ్ సింహాద్రి ఆరోపణ
- డీఆర్‌డీఏ పీడీ, ఎంపీడీవోకు ఫిర్యాదు

రోలుగుంట, మార్చి 2 : మండలంలోని కుసర్లపూడిలో ఈనెల 24న జరగనున్న గ్రామ దేవత పండుగ పేరుతో పింఛన్ల సొమ్ములో కోత విధించి లబ్ధిదారులకు అందిస్తున్నారని ఆ గ్రామ మాజీ సర్పంచ్ గండి సింహాద్రి శనివారం డీఆర్‌డీఏ పీడీ సచీదేవి, ఎంపీడీవో వెంకటేశ్వరరావులకు ఫిర్యాదు చేశారు. ఏడాదిలోపు కొత్తగా పింఛన్లు మంజూరైన వారి నుంచి పూర్తిగా రూ.3వేలు, పాత పింఛనుదారుల నుంచి రూ.1500 వసూళ్లు చేస్తున్నారన్నారు. గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల నుంచి బయోమెట్రిక్ వేయించుకుని మొత్తం సొమ్ములో కోత విధించి మిగతా సొమ్ము ఇస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజలు జీవనం సాగిస్తున్నారని, ఇలా పెన్షన్ల డబ్బులు వసూలు చేస్తే వారి పరిస్థితి ఏమిటని ఆయన వాపోయారు. క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఈ ఘటనపై సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి

- స్త్రీ విముక్తి సంఘటన ఉమ్మడి జిల్లా కన్వీనర్ లక్ష్మీకుమారి పిలుపు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్త్రీ విముక్తి సంఘటన ప్రతినిధులు

చోడవరం, మార్చి 2 : సమాజంలో మహిళలపై దాడులు, అరాచకాలను ప్రేరేపిస్తున్న మతోన్మాదశక్తులు, రాజకీయవాదులకు వ్యతిరేకంగా మహిళలంతా ఉద్యమించాలని స్త్రీవిముక్తి సంఘటన ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఓవీవీఎస్ లక్ష్మీకుమారి పిలుపునిచ్చారు. ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్న అంత ర్జాతీయ మహిళా పోరాట దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. ఆ రోజు చోడవరంలోని అంబేడ్కర్ భవనంలో ప్రత్యేక సభతో పాటు, ర్యాలీ ఉంటుందని చెప్పారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.గౌరీశంకర్, స్త్రీవిముక్తి సంఘటన సభ్యులు ఎ.లక్ష్మి, మాధురి, కల్పన, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీలు



దేవరాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గొలుగొండలో...


రోలుగుంటలో...



కృష్ణాదేవిపేటలో..

దేవరాపల్లి, మార్చి 2 : పల్స్ పోలియోపై శనివారం పలు మండలాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా దేవరాపల్లి, పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది ర్యాలీలు జరిపారు. ఈ కార్యక్రమంలో దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యులు పూజిత మేఘన, పినకోట పీహెచ్‌సీ వైద్యులు జి.వెంకటేశ్, డి.రూప్‌చంద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో శనివారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామ పుర వీధుల్లో ర్యాలీ సాగింది. వైద్యాధికారి శ్రావణి మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగ్గా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

గొలుగొండ : పల్స్ పోలియో విజయవంతానికి గొలుగొండ, చీడిగుమ్మల పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు శ్యామ్‌కుమార్, ధనుంజయల ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పోలియో రహిత సమాజంగా తీర్చుదిద్దుదామని నినాదాలు చేశారు. ఐదేళ్లలోపు చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎన్.హరిప్రవీణ్, గాయత్రి కోరారు. శనివారం పీహెచ్‌సీ నుంచి గ్రామ ప్రధాన రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సావిత్ర, లావణ్య, శ్రీలక్ష్మి, లక్ష్మి చిట్టిబాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మోదకొండమ్మ తీర్థం

మాడుగుల రూరల్, మార్చి 2 : ఇక్కడి ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో కొలువుదీరిన మోదకొండమ్మ తీర్థం ఆదివారం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా గుర్రపు పందేలతో పాటు సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ పూర్తి చేసుకున్న వారితో ప్రిన్సిపాల్ తదితరులు

చోడవరం, మార్చి 2 : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ కోరారు. కళాశాలలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. విద్యార్థులు స్వయం ఉపాధి పొందేందుకుఉ ఈ శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్‌హబ్ ఇన్‌చార్జిలు వి. అప్పలనాయుడు, శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి, కో-ఆర్డినేటర్ నారాయణమూర్తి, మంగమ్మ, సూర్యవతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

రావికమతం, మార్చి 2 : మరుపాక గ్రామంలోని మోడల్ స్కూల్‌లో రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యసునీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 21న పాఠశాలలో నిర్వహిస్తామని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తిచేసి విద్యారులు అర్హులుగా పేర్కొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టుబడిన ట్రాక్టర్లు

మాడుగుల రూరల్, మార్చి 2 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం పట్టుకుని సీజ్ చేసినట్టు మాడుగుల ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. శంకరం గ్రామం వద్ద ఈ ట్రాక్టర్లు వెళుతుండగా పట్టుకున్నట్టు చెప్పారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సదరు యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

'జనసేనలో చేరినవారు వైసీపీ వారు కాదు'

బుచ్చెయ్యపేట, మార్చి 2 : వైసీపీని వీడి జనసేన పార్టీలో తన అనుయాయులతో చేరుతున్నట్టు రసూల్ పేర్కొనడాన్ని శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో వైసీపీ వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి ఖండించారు. రసూల్, ఆయన అనుయాయులు వైసీపీకి చెందిన కార్యకర్తలు కాదని, పార్టీ సభ్యత్వం లేదని వివరించారు.

'మాదిగ అమరవీరుల త్యాగాలను మరువలేం'

చీడికాడ, మార్చి 2 : మాదిగ అమరవీరుల త్యాగాలను ఎన్నటికీ మరువలేమని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి జైతవరం గ్రామంలో జరిగిన మహాజన సోషలిస్ట్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అమరవీరులైన వారి ఆశయాలకు అనుగుణంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అంతా కలిసి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో నాగరాజు, సంతోష్, మంగయ్య, గుమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా ఆకట్టుకున్న సైన్స్ ఫెస్ట్


విద్యార్థులు తయారు చేసిన ల్యాండ్ రోవర్,చంద్రయాన్ ప్రాజెక్టులు

చోడవరం, మార్చి 2 : పట్టణంలోని ఏడమ్స్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా విద్యార్థులు చంద్రయాన్ త్రీ, రోవర్ ల్యాండింగ్ నమూనాలతో పాటు, సూర్యుడిమీదకు పంపిన ఆదిత్య 1,2 శాటిలైట్ల ద్వారా బ్లూటూత్ పనిచేసే విధానం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. కరస్పాండెంట్ బద్రిమహంతి ఫల్గుణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా అచ్చెంనాయుడును పునర్నియమించవద్దు

- ఎమ్మెల్యే ధర్మశ్రీని కోరిన ఎంపీపీ నాగేశ్వరిదేవి

బుచ్చెయ్యపేట, మార్చి 2 : వైసీపీ బుచ్చెయ్యపేట మండల అధ్యక్షుడిగా కొల్లిమళ్ళ అచ్చెంనాయుడును పునర్నియామకం చేపట్టవద్దని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆమె ఇక్కడ మాట్లాడుతూ బీసీ సామాజికవర్గానికి ఎంపీపీ పదవి రిజర్వు కావడంతో తాను ఆ పదవి చేపట్టినా, వైసీపీ మండల అధ్యక్ష హోదాతో పాటు ఎంపీపీ అధికారాలను అచ్చెంనాయుడు చెలాయిస్తూ తనకు లభించిన రాజ్యాంగ హక్కులను ఆయనే అనుభవించేవారని నాగేశ్వరిదేవి ఆరోపించారు. ఎంపీపీ కార్యాలయంలో తనకు కేటాయించిన సీటు పక్కనే సమాంతరంగా మరో కుర్చీని వేసుకుని ఎంపీపీ చేయవలసిన పనులు ఆయనే చేసేవారన్నారు. దీనిపై జడ్పీ అధికారాలకు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి తెలియజేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఏళ్ల తరబడి ఒకే వ్యక్తి పార్టీ మండల అధ్యక్ష పదవిలో కొనసాగడంపై పార్టీ అధిష్టాన పెద్దల అభ్యంతరం మేరకు ఎమ్మెల్యే ఇటీవల అచ్చెంనాయుడుని తప్పించి, ఆ పదవిలో తమ సామాజిక వర్గానికి చెందిన జోగా కొండబాబును నియమించారన్నారు. ఆయన తన పార్టీ పదవి హక్కులకు లోబడి వ్యవహరించడంతో తాను ఎంపీపీ హోదాలో అధికారిక కార్యక్రమంలో పాల్గొంటున్నానన్నారు. అయితే అచ్చెంనాయుడుకు తిరిగి పార్టీ మండల అధ్యక్ష పదవి కట్టబెట్టడానికి ఎమ్మెల్యే చర్యలను ఆమె వ్యతిరేకించారు. అచ్చెంనాయుడుకు తిరిగి పార్టీ పగ్గాలు అప్పగిస్తే, తన ఎంపీపీ అధికారాలను ఆయనే హస్తగతం చేసుకుంటారని వాపోయారు.